
నిఘా నీడలో రైజ్ కళాశాలలోని కౌంటింగ్ సెంటర్


కౌంటింగ్ ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్


కౌంటింగ్ సిబ్బందితో మాట్లాడుతూ..

లెక్క తేలింది

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ఉత్కంఠగా సాగింది. ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంగలకు కౌంటింగ్ ప్రారంభం కాగా.. దానికంటే ముందు నుంచే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ నేతలు.. కార్యకర్తలు భారీగా తరలి రావడంతో కౌంటింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలు వాహనాలతో నిండిపోయింది.


ఏమాత్రం అశ్రద్ధ వద్దు..


ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికారులు, ఏజెంట్లు


జాగ్రత్తగా లెక్కించండి సార్..


అంతా బాగానే ఉందిలే..


ఈవీఎంలను పరిశీలిస్తున్న సిబ్బంది


భారీగా పోలీసుల మోహరింపు


హైవే క్లోజ్..

క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు పాటించాలి

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో ఎన్నికల నిబంధనల్లో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు సంయమనం పాటించాలని ఎస్‌ఐ వైపీ రమణయ్య తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు గెలిచినా నాయకులు సంయమనం పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజలు నిబంధనలు విధిగా పాటించాలన్నారు. రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యాధులు సోకకుండా జాగ్రత్త వహించాలి

బల్లికురవ: వర్షాల సీజన్ ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తతో తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ మంగళవారం తెలిపారు. వర్షాలకు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సోకే ప్రమాదం ఉందని పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే సీజనల్ వ్యాధులు సోకకుండా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. నిలువ ఉన్న ఆహారాలు తీసుకోవద్దని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, కుంటలు, చెరువులోని నిలువ ఉన్న నీరు. తాగవద్దని చెప్పారు. అస్వస్థతకు లోనైతే తక్షణమే వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దన్నారు.

వృద్ధులకు అన్నదానం

మార్టూరు: గుంటూరు ఏటి అగ్రహారం గ్రామానికి చెందిన చోడాభద్రయ్య మాధవీలత స్థానిక అమ్మ ఆశ్రమంలో అన్నదానం జరిపించి వృద్ధులకు స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ నూతన భవనానికి రూ.5116 సహాయం అందజేశారు. వారికి ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందు ధన్యవాదాలు తెలియజేశారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, కృత్తిక నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చ,లా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పటిష్టంగా 144 సెక్షన్ అమలు


పామూరులో నిర్మానుషంగా ప్రధాన వీధులు


సీఎస్‌పురంలో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న ఎస్సై సిబ్బంది

పామూరు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై ఎం సైదుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమలు చేశారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘనటలు జరగలేదు. అదేవిధంగా దుకాణాలు కూడా మూసివేయించడంతో ప్రధానరోడ్లన్నీ నిర్మానుషంగా కనిపించాయి.

సీఎస్‌పురం(పామూరు): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా బుధవారం సాయంత్రం వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన సీఎస్‌పురంతోపాటు మండలంలోని గ్రామాల్లో మంగళవారం శాంతి భద్రతలను వారు పర్యవేక్షించారు. ఈసంర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎక్కడైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, పోస్టింగులు పెట్టినా చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా అనుమతులు లేకుండా ర్యాలీలు, విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

కందుకూరులో టీడీపీ విజయం

- 17,558 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన ఇంటూరి నాగేశ్వరరావు


డిక్లరేషన్ సర్టిఫికెట్‌తో ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు: దాదాపు రెండు దశాబ్దాల తరువాత కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి విజయం దక్కింది. మంగళవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల లెక్కింపులో ఆ పార్టీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌పై విజయం సాధించారు. దీంతో నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. మే 13న జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 2,28,913 ఓట్లకు గాను 2,04,202 ఓట్లు పోలయ్యాయి. వీటిలో మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో 1,07,546 ఈవీఎం ఓట్లతో పాటు, 1627 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలుపుకుని టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు మొత్తం 1,09,173 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 52.8శాతం ఓట్లను ఆయన సాధించారు. ఇక వైఎస్సార్ సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ 89,733 ఈవీఎం ఓట్లతో పాటు 882 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలుపుకుని 90,615 ఓట్లు పోలైయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మధుసూదన్‌యాదవ్‌కి 43.82 ఓట్లు వచ్చాయి. దీంతో టీడీపీ అభ్యర్థి 18,558 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 20 రౌండ్లలో రౌండ్ల వారీగా సాయంత్రం వరకు ఓట్ల లెక్కింపు కొనసాగింది. రాత్రి 9.30గంటల ప్రాంతంలో కౌంటింగ్ ప్రక్రియను ముగించిన రిటర్నింగ్ అధికారి నాగేశ్వరరావు విజయం సాధించినట్లు డిక్లరేషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. 1999లో చివరిసారిగా కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. తిరిగి దాదాపు ఇరవై ఏళ్ల తరువాత కందుకూరులో మళ్లీ టీడీపీకి విజయం దక్కింది. దీంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

కనిగిరిలో 22 రౌండ్లలో తేలిన ఫలితం..

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల లెకింపు ఆర్వో పాలపర్తి జాన్ ఇర్విన్ పర్యవేక్షణలో మంగళవారం ఒంగోలు లోని రైజ్ గాంధీ కృష్ణా కాలేజీ రెండో అంతస్తు భవనంలో జరిగింది. పకడ్బందీ ఏర్పాట్ల మధ్య లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. నియోజక వర్గంలోని ఆరు మండలాల్లోని 297 పాలింగ్ బూత్‌లలో జరిగిన పాలింగ్ ఓట్ల లెక్కింపుకు సంబంధించి 14 టేబుళ్ల ఏర్పాటు చేయగా, 22 రౌండ్లలో లెక్కింపు పూర్తి అయ్యింది. లెక్కింపు ఫలితాల ప్రక్రియ మొదటి రౌండ్ హెచ్‌ఎంపాడు మండలం మొహ్మదాపురం బూత్ నుంచి ప్రారంభమై.. తుదిగా పామూరు మండలం రేణిమడుగుతో ముగిసింది. తొలి ఐదు రౌండ్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ఆధిక్యతలో ఉన్నా.. ఆ తర్వాత రౌండ్లలో టీడీపీ అభ్యర్థి ఉగ్ర ఆధిక్యత ప్రదర్శించారు.

పకడ్బందీ చర్యలు తీసుకున్న పోలీసులు ..

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరిగిన నేపథ్యంలో మంగళవారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రత్నాకరం రామరాజు పర్యవేక్షణలో పోలీసులు కనిగిరి డివిజన్‌లో పకడ్బంధి చర్యలు చేపట్టారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేశారు. సెక్షన్ 144, పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసులు పూర్తి గస్తీ నిర్వహించారు.

వైభవంగా గంగాభవానీ గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ మూల, ఉత్సవ విగ్రహమూర్తులు


గంగాభవాని ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పామూరు: మండలంలోని మోపాడు గంగాభవానీ తిరునాళ్లలో భాగంగా 3వ రోజు మంగళవారం గంగామాత గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోపాడు గంగానగర్, లక్ష్మీ నరసాపురం, ఇనిమెర్ల గ్రామాల్లో గంగాభవాని ఉత్సవ విగ్రహమూర్తిని, బొల్లావులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్చుతూ ఉత్సవం నిర్వహించారు. ముందుగా గంగామాత ఆలయంలో గంగామాత మూల విగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమపూజ, విశిష్ట పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోండి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న గ్రంథపాలకుడు

ఉలవపాడు: గ్రంతాలయాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం జరిగిన వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవాలని కోరారు. ముందుగా విద్యార్థులతో నీతి కథలు, మహనీయుల చరిత్రలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను చదివించారు. మొత్తం 52 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు.

6,7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు పనిచేయవు

చీరాల అర్బన్: చీరాల ఆర్టీసీ డిపోలో కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న కారణంగా ఈనెల 6,7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు పనిచేయవని డిపో మేనేజర్ జె.శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి బస్‌పాస్‌ల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు, ప్రయాణికులు ఈవిషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు మంగళవారం గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, వక్తృత్వ పోటీలు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్‌లపై శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరంలో 15 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు తెలిపారు.

నీట్‌లో జ్ఞానశ్రీ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం టౌన్: నీట్–2024 ఫలితాల్లో మార్కాపురం పట్టణంలోని జ్ఞానశ్రీ నీట్ అకాడమీ విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ ఎం.మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. 720 మార్కులకుగాను జి.మోహన్ పూర్ణ 575 మార్కులు, కె.రాగ అక్షయ 530 మార్కులు, ఎస్‌కే మహమ్మద్ నిహాల్ 380 మార్కులు సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకాడమీ డైరెక్టర్, అధ్యాపకులు అభినందించారు.